సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 16 । ఆగస్టు । 2023



ఉత్తమ సేవలకు ప్రశంస

ఉత్తమ ఉద్యోగులు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. వీరిని కలెక్టర్ అభినందించారు.

- 8లో



పనిమనిషి దారుణ హత్య

శ్రీకాకుళం పరిధిలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- 8లో



యువతి అనుమానాస్పద మృతి

శ్రీకాకుళానికి కాస్త దూరంలో ఓ యువతి అనుమానాస్పద రీతిలో మృతి చెందారు. ఆమె వివరాలు ఇంకా తెలియరాలేదు.

- 8లో

చూడవోయి భారతీయుడా..

కదిలి సాగెనోయి ప్రగతిదారుల

స్వాతంత్ర్య స్ఫూర్తి చాటి చెబుతూ.. చిన్నారుల నాట్య విన్యాసాలు. ప్రభుత్వ పథకాల మంచిని వివరిస్తూ.. సంక్షేమ శకటాల కవాతులు. స్వేచ్ఛా సంగ్రామ గురుతులను వివరిస్తూ.. అతిథుల ప్రసంగాలు. పంద్రాగస్టు వేడుకలను ఆస్వాదిస్తూ.. వీక్షకుల కేరింతలు.. వెరసి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకలు అట్టహాసంగా జరిగాయి. పతాక ఆవిష్కరణ నుంచి సాంస్కృతిక కార్యక్రమాల వరకు, శకటాల ప్రదర్శన నుంచి స్టాళ్ల ఏర్పాటు, ప్రసంగాల నుంచి బహుమతుల ప్రదానం వరకు ప్రతి ఘట్టం ఆకట్టుకుంది.





జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న మంత్రి బొత్స, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్సీ రామారావు, తదితరులు (ఇన్‌సెట్లో) కోటబొమ్మాళి మండలం తిలారు గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమర యోధులు అప్పలరామయ్య భార్య అప్పలనరసమ్మకు మంత్రి బొత్స పలకరింపు

అవినీతి రహితం.. సంక్షేమ సహితం

- నాలుగేళ్లలో స్వచ్ఛమైన పాలన అందించాం
- ప్రజల వద్దకే సంక్షేమం
- గ్రామ స్వరాజ్య స్ఫూర్తిగా సచివాలయ, వలంటీర్ల సేవలు
- స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి బొత్స సత్యనారాయణ



వేదికపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, గొర్లె కిరణ్‌కుమార్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధిక తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్వచ్ఛమైన పాలన అందిస్తోందని, నాలుగేళ్లలో విప్లవాత్మక మార్పులతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని, జిల్లాకు సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట వేశారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి పతాకావిష్కరణ చేసి ప్రసంగించారు. జిల్లాలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం తాగునీటి ప్రాజెక్టులు రూపొందించామని, ప్రజల వద్దకే సంక్షేమం అందిస్తున్నామని పేర్కొన్నారు.

మనబడి నాడు-నేడు ద్వారా మొదటి దశలో 1247, రెండో దశలో 1096 అంగన్‌వాడీలు, బడులు, కాలేజీలు బాగు చేశామని తెలిపారు. గత ఏడాది పదో తరగతి పరీక్షల ఫలితాల్లో జిల్లా రెండో స్థానంలో నిలిచినందుకు గర్వంగా ఉందన్నారు. సూపర్-60లో 20 మంది గిరిజన విద్యార్థులు జేఈఈ పరీక్షల్లో అర్హత సాధించారని తెలిపారు. విద్యతో పాటు వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, డయాలసిస్ యూనిట్లను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా సేవలు అందిస్తున్నామని తెలిపారు. రిమ్స్‌ను రూ.150 కోట్లతో ఆధునికీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు.

వ్యవసాయంలో కూడా అనేక మార్పులు తీసుకువచ్చామని రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తు నుంచి విక్రయాల వరకు రైతులకు అండగా ఉంటున్నామని పేర్కొన్నారు. నాబార్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ పథకం కింద ఐదు వంతెనలు, 16 రోడ్లు పూర్తి చేశామన్నారు.



న్యూ సెంట్రల్ స్కూల్ విద్యార్థుల నృత్యరూపకం

ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం సముద్ర తీరంలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నామని, ఇక్కడ 780 బోట్లు నిలిపేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే మూల పేట పోర్టులో మొదటి దశలో నాలుగు బెర్త్‌లు నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ 35 వేల మందికి ఉపాధికి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. నిర్వాసితులకు ఆర్‌ఆర్ కాలనీ కూడా నిర్మిస్తున్నామన్నారు. వంశధార, ఇతర సాగునీటి ప్రాజెక్టులు ప్రాధాన్యత క్ర మంలో పూర్తి చేస్తున్నామని తెలిపారు. సవరించిన బడ్జెట్‌కు పరిపాలనపరమైన అనుమతులు కూడా వచ్చాయన్నారు. ఉద్దానం కోసం ప్రభుత్వం రూ.700 కోట్లతో మంచినీటి పథకాన్ని ఏర్పా టు చేసిందన్నారు. జిల్లాలో గల 5,38,658 గృహ సముదాయాలకు ఇప్పటి వరకు 1,70,354 గృహాలకు నీటి వసతి కల్పించామని వివరించారు. మరికొన్ని పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. జిల్లాలో 4.43 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయని, వేతనదారులకు రూ.154.35 లక్షల పనిదినాలు కల్పించామని చెప్పారు. వంద రోజుల పని కల్పించడంలో జిల్లా రాష్ట్రంలోనే సెకండ్ ప్లేస్‌లో ఉందన్నారు.

పలు సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ విధానంలో రూ.19,938.52 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో 75,840 గృహాలు నిర్మితమవుతున్నాయని తెలిపారు. జిల్లాలో రూ.1611కోట్లు పెట్టుబడితో 20 పరిశ్రమలు స్థాపించి 6,943 మందికి ఉపాధి కల్పించామని, రూ.1170 కోట్ల పెట్టుబడితో మరో 4 భారీ, మధ్య తరహా పరిశ్రమలు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు.

ఉత్సాహంగా జెండా వందనం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లా కేంద్రంలో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పతాక ఆవిష్కరణ చేశారు. ఆయనతో పాటు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధిక పాల్గొని గౌరవ వందనం చేశారు. మైదానంలో పోలీసులు, హోం గార్డులు, ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

- వేడుకల్లో భాగంగా పలు శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. ఈ స్టాళ్లను మంత్రి, ఇతర అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ లబ్ధిదారులకు పథకాలు అందజేశారు. అలాగే పంచాయతీల్లో నగదు రహిత లావాదేవీలు ప్రారంభించారు.

కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు పిరియా విజయ, శాసన మండలి సభ్యులు నర్తు రామారావు, మాజీ ఉప ముఖ్యమంత్రి, శాసన సభ్యులు ధర్మాన కృష్ణదాస్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, కాపు కార్పొరేషన్ అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, డీసీసీబీ అధ్యక్షుడు కరిమి రాజేశ్వరరావు, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఆర్డీఓ బి.శాంతి, తదితరులు పాల్గొన్నారు.



గార కేజీబీవీ విద్యార్థుల నృత్యం



టీపీఎం ఉన్నత పాఠశాల విద్యార్థినుల ప్రదర్శన

సాంస్కృతిక కార్యక్రమాలలో శ్రీకాకుళంలోని న్యూ సెంట్రల్ స్కూల్‌కు మొదటి బహుమతి, గార కేజీబీవీకి రెండో బహుమతి, శ్రీకాకుళం టీపీఎం స్కూల్‌కు మూడో బహుమతి లభించాయి. న్యూ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు మూడు రంగుల జెండా గీతం, సంప్రదాయం నాట్యం గురుకులం విద్యార్థులు నెత్తురు మరిగితే ఎత్తర జెండా గీతం, టీపీఎం హెచ్ స్కూల్ శ్రీకాకుళం వైభవం గీతం, ఆర్‌సీఎం లయోలా విద్యార్థులు జయతు జయతు భారతం గీతం, లావేరు కేజీబీవీ విద్యార్థులు పాడుదమా స్వేచ్ఛా గీతం, పెద్దపాడు అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు హిందీ గీతానికి నృత్యాలు చేశారు. అలాగే ఐటీడీఏ వారి పోస్టుమెట్రిక్ బాలికల వసతిగృహం విద్యార్థులు థింసా, గార కేజీబీవీ విద్యార్థులు వందేమాతరం, దేశ్ మేరే గీతంపై నాట్యం చేశారు.







శకటాల ప్రదర్శనలో మొదటి బహుమతి పౌర సరఫరాల శాఖ, రెండో బహుమతి గృహ నిర్మాణ శాఖ, మూడో బహుమతి డీఆర్‌డీఏ గెలుచుకున్నాయి.

కలెక్టర్‌కు జాతీయ జెండా బహూకరణ

సారవకోట: మండలంలోని బుడితి గ్రామానికి చెందిన కంచు, ఇత్తడి, సూక్ష్మ కార్మికుడు కింతాడ బుజ్జిబాబు తయారు చేసిన 15 అంగుళాల జాతీయ జెండాను మంగళవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు బహూకరించారు. శ్రీకాకుళంలోని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి మరీ దీన్ని అందజేశారు.



15 అంగుళాల జాతీయ జెండాను కలెక్టర్‌కు బహూకరిస్తున్న కింతాడ బుజ్జిబాబు

న్యాయవాదులు క్రమశిక్షణతో మెలగాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఆకాంక్షించారు. జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అధ్యక్షతన మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు క్రీడాస్ఫూర్తిని చాటుతూ ఆటల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఆటలు మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ, షటిల్, క్యారమ్స్, చెస్‌తో పాటు పాటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందించి వారిని అభినందించారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి కె.శ్రీదేవి, మూడో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, నాల్గో అదనపు జిల్లా జడ్జి ఎస్.మహేంద్ర ఫణి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఆర్.సన్యాసినాయుడు, అడిషనల్ సివిల్ జడ్జి అనురాధ, బార్ కౌన్సిల్ ప్రతినిధులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



బార్ కార్యాలయంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

ఈదుపురం కల.. నెరవేరిన వేళ

ఇచ్ఛాపురం రూరల్: దశాబ్దాల ఈదుపురం వాసుల కల నెరవేరబోతోంది. మత్స్యకార గ్రామాలతో పాటు సుమారు పాతిక గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందని ద్రాక్షగా మిగిలిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎంపీ రామ్మోహన్‌నాయుడులు ఈదుపురం ప్రాంతంలో ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మిస్తామంటూ ఇచ్చిన హామీ బాహుదానదిలో కలిసిపోయింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్‌ల కృషితో 2021 జూలై 9న అప్పటి ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాసు చేతులు మీదుగా ఈదుపురంలో నాబార్డ్ నిధులు రూ.185 లక్షలతో ప్రభుత్వ ఆస్పత్రి పనులకు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం పీహెచ్‌సీ పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధమైందని ఆర్‌అండ్‌బీ డీఈఈ ఎస్.రామినాయుడు తెలిపారు.



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఈదుపురం పీహెచ్‌సీ

త్యాగధనుల ఆశయాల మేరకే పాలన



వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న కృష్ణదాస్, కృపారాణి, ఎమ్మెల్సీ రామారావు, కార్పొరేషన్ చైర్మన్లు, తదితరులు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): స్వరాజ్య సాధనలో ఉద్యమించిన మహనీయుల ఆశయాలకు అనుగుణంగానే రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి సుపరిపాలనను అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో చంద్రమహల్‌కి ఎదురుగా ఉన్న పార్టీ కార్యాలయంలో మంగళవారం స్వాతంత్ర్య వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయలేని మార్పుల్ని సీఎం వైఎస్ జగన్ తీసుకొచ్చారని చెప్పారు. 98.5 శాతం వాగ్దానాలను అమలు చేసిన ప్రభుత్వం కూడా ఇదేనని అన్నారు. 45వేల స్కూళ్ల రూపురేఖలు మార్చారని గుర్తు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరిగే పరిస్థితి ఇప్పుడు లేదని, అన్ని సేవలు ఇంటి వద్దకే తెచ్చి అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలన్నీ అక్కచెల్లెమ్మల పేరు మీదే ఇస్తూ రూ.2.31 లక్షల కోట్లను నేరుగా ప్రజలకు అందించారని వివరించారు. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి మాట్లాడుతూ అధికారంలో ఉన్నన్నాళ్లు ప్రజల్ని దోచుకున్న చంద్రబాబునాయుడు, అతని అనుచరులు ఇప్పుడు ఎన్నో నీతి కబుర్లు చెబుతున్నారన్నారు. జిల్లాలో వంశధార, ఆఫ్‌షోర్, తోటపల్లి తదితర ప్రాజెక్టులకు ఆద్యులు దివంగత వైఎస్సార్ అయితే వాటి కోసం తాను ఎంతో చేశానంటూ చంద్రబాబు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, తూర్పు కాపు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, ఎంపీ పద్మావతి, పైడిశెట్టి జయంతి, చల్ల అలివేలుమంగ, సాధు వైకుంఠరావు, పొన్నాడ రుషి, ఎన్ని ధనుంజయరావు, శిమ్మ రాజశేఖర్, ఎం.ఏ రఫీ, సిజు, ఎం.ఏ బేగ్, మూకళ్ళ తాతబాబు, రౌతు శంకరరావు, టి.కామేశ్వరిలతో పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జిల్లా సచివాలయాలకు రాష్ట్రంలో ప్రథమ స్థానం



లక్ష్మీషా నుంచి అవార్డు స్వీకరిస్తున్న జిల్లా నోడల్ అధికారి వాసుదేవరావు

అరసవల్లి: గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాల అమలులో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు సిక్కోలుకు రాష్ట్రంలోనే ప్రథమ స్థానం దక్కింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలో సచివాలయాల డైరెక్టర్ లక్ష్మీషా ఈ అవార్డును ప్రకటించారు. ఈ క్రమంలో జిల్లా సచివాలయాల నోడల్ అధికారి పి.వాసుదేవరావుకు అవార్డు, జ్ఞాపికను మంగళవారం అందజేశారు.

డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాలు విడుదల



డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ ఆరో సెమిస్టర్ (చివరి సెమిస్టర్) ఫలితాలను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మంగళవారం విడుదల చేశారు. ఈ పరీక్షలు జూన్ 27 నుంచి జూలై 11 వరకు నిర్వహించారు. మొత్తం 11,884 మంది హాజరు కాగా, 5799 మంది ఉత్తీర్ణత సాధించారు. 49 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఫలితాలు జ్ఞానభూమి వెబ్ సైట్‌లో పొందు పర్చారు. ఫెయిల్ అయిన విద్యార్థులు రీ వాల్యుయేషన్ కోసం 15 రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

అలరించిన దేశభక్తి గీతాలు



నృత్యాలు చేస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో సాంస్కృతిక మండలి, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం దేశభక్తి గీతాల నృత్య ప్రదర్శన చక్కగా జరిగింది. చైతన్య టెక్నోస్కూల్ విద్యార్థులు స్వాగతం, ఆర్‌సీఎం లయోలా పాఠశాల విద్యార్థులు జయతు జయతు, టీపీఎం హెచ్ స్కూల్ శివానీ, భవానీ, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు భరతఖండమే నా దేశం, సాయి మందిరం విద్యార్థులు ఈ జెండా అమరుల చిరునవ్వురా తదితర గీతాలతో అలరించారు. ముందుగా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఇతర అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు.

దేశ రాజధానిలో..



పొందూరు: పొందూరుకు చెందిన ఖాదీ కార్మికులు బల్ల భద్రయ్య-లక్ష్మి దంపతులు, జల్లేపల్లి సూర్యకాంతంలు మంగళవారం దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రకోటపై ఇలా కనిపించారు.

విజయవాడలో ధర్నాకు అనుమతి లేదు

అరసవల్లి: జిల్లాలో విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విజయవాడలో ధర్నాకు సిద్ధమవుతున్నారని సమాచారం ఉందని, అయితే ఈ ధర్నాకు ఎలాంటి అనుమతులు లేవని చీఫ్ విజిలెన్స్ అధికారి ఏపీఎల్ ప్రసన్నకుమార్ స్పష్టం చేశారు. ఈనెల 17న నిర్వహించతలపెట్టిన ఈ ధర్నాకు ఎలాంటి ముందస్తు అనుమతులు లేవని విజయవాడ సిటీ పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారని, ఈ క్రమంలో జిల్లాలో ఎవ్వరూ ఈ ధర్నా కోసం వెళ్లి ఇబ్బందులు పడొద్దని విజ్ఞప్తి చేశారు.

ఉత్తమ సేవలకు ప్రశంస

ఉత్తమ సేవలు అందించిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా మంగళవారం ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో 269 మంది వీటిని అందుకున్నారు.

-శ్రీకాకుళం పాతబస్టాండ్/శ్రీకాకుళం పీఎన్ కాలనీ





మంత్రి బొత్స చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జెడ్పీ సీఈఓ వెంకటరామన్

రాకపోకలకు ఇబ్బందిలేకుండా ఏర్పాట్లు



వంతెన పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ కృష్ణచైతన్య

జలుమూరు: అందవరం వద్ద వంశధార కాలువపై కూలిన వంతెనను మంగళవారం రోడ్లు, భవనాల శాఖ ఎస్ఈ జాన్ సుధాకర్, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య పరిశీలించారు. వంతెన కూలడంతో ప్రజలకు కలిగిన ఇబ్బందులు దృష్ట్యా వెంటనే తాత్కాలిక రాకపోకలు సాగించేందుకు ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ రోడ్డు గుండా భారీ వాహనాలు రాకుండా నియంత్రించి పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ చొరవతో నిధులు మంజూరుకు కృషి చేసి వంతెన పనులు త్వరలోనే ప్రారంభించి వినియోగంలోకి తీసుకొస్తామని కృష్ణచైతన్య తెలిపారు. వంశధార, రోడ్లు భవనాల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వంతెన పరిసర గ్రామాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదన్నారు. కార్యక్రమంలో వంశధార డీఈఈ బగ్గు నరసింగరావు, రోడ్లు భవనాల శాఖ జేఈ రాజశేఖర్, స్థానిక నాయకులు రేగాన శ్యామ్, గోవిందరావు, మండల పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, చల్లవానిపేట సొసైటీ అధ్యక్షుడు రాజప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పనిమనిషి దారుణహత్య

- రిటైర్డ్ వైద్యుడి ఇంట్లో ఘటన
- దర్యాప్తు చేస్తున్న రూరల్ పోలీసులు





మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్లో) రాజు (ఫైల్)

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పెదపాడు వీరన్న షెడ్డు పరిసర ప్రాంతంలో రిటైర్డ్ వైద్యుని ఇంట్లో సోమవారం అర్ధరాత్రి ఓ మహిళ దారుణహత్యకు గురైంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళంలో వైద్యునిగా పనిచేసిన డాక్టర్ గొల్లంగి జగన్నాథం ఇంట్లో సుమారు పాతికేళ్లుగా ఇద్దరు మహిళలు తాళ్లవలస రాజు(35), చిట్టెమ్మ పనిమనుషులుగా ఉంటున్నారు. వీరిలో రాజు చిన్నప్పటి నుంచి వైద్యుని ఇంటిలోనే ఉంటోంది. వివాహం కాలేదు. మరో మహిళ చిట్టెమ్మ స్వస్థలం ఎచ్చెర్ల మండలం పొన్నాడ. ఈమెకు వివాహమైంది. జగన్నాథం కుటుంబమంతా ప్రస్తుతం విశాఖపట్నంలోనే నివాసం ఉంటున్నారు. ఈయన కుమారుడు కూడా డాక్టర్ కావడంతో శ్రీకాకుళంలోని ఓ నర్సింగ్ హోంలో ఆర్థోపెడిక్ సర్జన్‌గా సేవలందించేందుకు వారానికి ఒకసారి వచ్చి ఓపీ చూసి వెళ్తుంటారు. ఆ సమయంలో వంట చేసేందుకు, ఇంటిని చూసుకునేందుకు రాజు, చిట్టెమ్మలు నమ్మకంగా పనిచేస్తున్నారు.

ఏం జరిగిందంటే..

పనిమనుషుల్లో ఒకరైన రాజు శ్రీకాకుళం నగరంలోని ఇలిసిపురంలో బంధువుల ఇంటికి ఆదివారం వెళ్లి తిరిగి సోమవారం సాయంత్రానికి వచ్చేసింది. అదే రోజు రాత్రి ఏమైందో గానీ తలపై బలమైన గాయాలతో హత్యకు గురైంది. ఈ విషయాన్ని మరో పనిమనిషి చిట్టెమ్మ వైద్యుని ఇంటి పక్కనే ఉన్న షాపు యజమానులకు మంగళవారం ఉదయం చెప్పింది. వారు విశాఖలోని జగన్నాథంకు ఫోన్‌లో విషయం చేరవేశారు. ఆయన శ్రీకాకుళం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన క్లూస్‌టీం సభ్యులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రక్తపు మరకలతో నైటీ, నిరోధ్ ప్యాకెట్లు గుర్తించినట్లు తెలిసింది. హత్య జరిగిన ప్రదేశాన్ని శ్రీకాకుళం డీఎస్పీ వై.శృతి పరిశీలించారు. టౌన్ సీఐ సన్యాసినాయుడు, రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అనుమానాస్పద మృతి



యువతి మృతదేహం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం నగరానికి కూతవేటు దూరంలో పొన్నాడ వంతెన సమీపంలోని కొంగరాం తోటల్లో మంగళవారం గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యమైంది. వ్యవసాయ పనుల నిమిత్తం వెళుతున్న స్థానికులకు మృతదేహం కనిపించటంతో ఎచ్చెర్ల పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలు ఈ ప్రాంతానికి చెందిన యువతి కాదు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ మార్చురీకి తరలించారు. విషయం తెలుసుకున్న శ్రీకాకుళం డీఎస్పీ శృతి, జేఆర్‌పురం సీఐ ఎ.ఆదాం, ఎస్సై వి.సత్యనారాయణ, క్లూస్‌టీమ్ సభ్యులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. యువతిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం జరిగినట్లు అనుమానిస్తున్నారు. వేరే ప్రాంతంలో హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడ పడేసి ఉంటారా అన్న అనుమానం కూడా కొందరు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు అన్నిస్టేషన్లకు సమాచారం అందించారు. సోషల్‌మీడియాలో ఫొటోలు పోస్టు చేసి వివరాల కోసం ప్రయత్నిస్తున్నారు. యువతి చిరునామా లభిస్తే మృతికి గల కారణాలు తెలుసుకునే అవకాశం ఉందని, వివరాలు తెలిసిన వారు ఎస్సై: 6309990853, సీఐ:6309990816 నంబర్లను సంప్రదించవచ్చని పోలీసులు సూచించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా హత్యా? ఆత్మహత్యా? అనే అంశం తెలుసుకునే అవకాశం ఉందన్నారు.

మర్రిచెట్టు కూలి రెండు ఇళ్లు ధ్వంసం



ఎర్రగోవిందపుట్టుగలో ఇళ్లపై కూలిన మర్రిచెట్టు

కవిటి: మండలంలోని ఎర్రగోవిందపుట్టుగ జంక్షన్‌లో సోమవారం రాత్రి ఎటువంటి ఈదురుగాలులు లేకుండానే భారీ మర్రిచెట్టు నేలకొరిగింది. ఈ ఘటనలో ప్రాణనష్టం ఏమీ సంభవించనప్పటికీ రెండు ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రమాదం జరిగినప్పుడు అంతా ఇంటిలోనే ఉన్నా అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ కడియాల పద్మ, కడియాల ప్రకాష్, ఎంపీటీసీ మానేక శంకర్‌లు మండల రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. డీటీ పడాల రామచంద్రరావు, వీఆర్‌ఓ నారాయణ తదితరులు ఘటనా స్థలానికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం కవిటి ఎంపీపీ కడియాల పద్మ బాధిత కుటుంబాలకు తక్షణ సాయంగా రెండు బస్తాల బియ్యం, రేషన్ సరకులను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.శేఖర్, ఎంపీడీఓ పి.సూర్యనారాయణ, లక్ష్మణరావు, మానేక శంకర్, పి.నీలాచలం, పి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాకాహార ప్రపంచమే లక్ష్యం



ర్యాలీలో పాల్గొన్న పిరమిడ్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీస్ మూమెంట్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో మెగా శాకాహార సద్భావనా ర్యాలీ నిర్వహించారు. సుమారు వెయ్యి మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంత్ సదానంద గిరి స్వామి మాట్లాడుతూ శాకాహార ప్రపంచంగా రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం అంబేడ్కర్ ఆడిటోరియంలో జరిగిన సభలో ఏఎస్పీ పి.వి తలేశ్వరరావు మాట్లాడుతూ జంతు హింస విడనాడాలని, గాంధీ సిద్ధాంతమైన అహింసను పాటించాలని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ ధ్యానం చేయాలన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ ప్రతినిధులు జి.బాలకృష్ణ, సిద్దా నాగేశ్వరరావు, ఇందిరాలక్ష్మీ, రేవతి, రామకృష్ణ, బాలాజీ, బిందుమాధవి తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

లావేరు: వైకేపీలో పనిచేస్తున్న వీఓఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వీఓఏల సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.ధనలక్ష్మీ, జి.అరుణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మీ డిమాండ్ చేశారు. అదపాకలోని ఏఎంసీ యార్డు వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి గ్రూపు ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220